టికెట్లు, పాస్‌ల కుదింపు సరికాదు

అమీర్ పేట్, జూన్ 22: బీఆర్‌ఎస్ ప్రభుత్వ హయాంలో బల్కంపేట ఎల్లమ్మ దేవాలయ అభివృద్ధికి ప్రత్యేక చర్యలు తీసుకోవడంతో పాటు పదేళ్లపాటు అమ్మవారి కల్యాణోత్సవాన్ని వైభవంగా నిర్వహించామని సనత్‌నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్ పేర్కొన్నారు. తెలంగాణ పద్మశాలి సంఘం నాయకులు జయరాజ్ ఆధ్వర్యంలో కల్యాణోత్సవానికి సంబంధించి ప్రతిఏటా సమర్పించే పోచంపల్లి పట్టు వస్త్రాలైన మూడు చీరలను మగ్గంపై తయారు చేసే పనులను ఎమ్మెల్యే తలసాని ఆదివారం దేవాలయ ఆవరణలో పూజలు నిర్వహించి ప్రారంభించారు. ఈ సందర్భంగా భక్తులు.. కల్యాణోత్సవ ఏర్పాట్లకు సంబంధించి కల్యాణ టికెట్లు, డోనర్ పాసుల సంఖ్యను గణనీయంగా కుదించిన అంశాలను తలసాని దృష్టికి తీసుకువచ్చారు.

చర్యలు సరికాదు

కల్యాణోత్సవానికి భక్తుల తాకిడి పెరుగుతోందని, ప్రభుత్వం అందుకు అనుగుణంగా ఏర్పాట్లు చేయాలి తప్ప, భక్తులను నియంత్రించే పనులు చేయవద్దని ఎమ్మెల్యే తలసాని కోరారు. బల్కంపేట ఎల్లమ్మ అమ్మవారికి జులై 2 వ తేదీన పాత బస్తీకి చెందిన ఉమ్మడి దేవాలయాల ఊరేగింపు కమిటీ ఆధ్వర్యంలో బంగారు బోనం సమర్పిస్తారని ఎమ్మెల్యే తలసాని తెలిపారు. సుమారు 500 మంది వివిధ దేవాలయాలకు చెందిన కమిటీ ప్రతినిధులు అమ్మవారికి బోనం సమర్పించే కార్యక్రమంలో పాల్గొంటారని చెప్పారు. మాజీ కార్పొరేటర్ శేషుకుమారి, ఆలయ చైర్మన్ సాయిబాబా గౌడ్, ఈవో మహేందర్ గౌడ్, సూపరింటెండెంట్ హైమవతి, హన్మంతరావు, అశోక్ యాదవ్, సంతోష్ కుమార్, నర్సింహ, బలరాం, శ్రీనివాస్ గౌడ్, శ్రీనివాస్, జయరాజ్ పాల్గొన్నారు.

బయో డేంజర్ బెల్స్

గ్రేటర్‌లో ప్రమాదకరంగా బయో వ్యర్థాల డంపింగ్

- మున్సిపల్ వ్యర్థాల్లోనే పారబోత
- కుప్పలుతెప్పలుగా మెడికల్ వ్యర్థాలు
- రోగాలబారిన చెత్త సేకరణదారులు
- మొద్దునిద్రలో నియంత్రణ అధికారులు

నార్సింగి డొమెస్టిక్ డంపింగ్ యార్డు

గృహ వ్యర్థాలతో బయో మెడికల్ వ్యర్థాలు

సిటీ బ్యూరో, జూన్ 22 (నమస్తే తెలంగాణ): గ్రేటర్ పరిధిలోని మున్సిపల్ డంపింగ్ యార్డుల్లో బయో మెడికల్ వ్యర్థాలు డేంజర్ బెల్స్ మోగిస్తున్నాయి. నగరం నలుమూలలా ఏ డొమెస్టిక్ డంపింగ్ యార్డులో చూసినా దవాఖానల నుంచి తీసుకువచ్చిన మెడికల్, కెమికల్ వ్యర్థాలు కుప్పలుతెప్పలుగా దర్శనమిస్తున్నాయి. దవాఖానల నుంచి వ్యర్థాలను సేకరించడానికి ప్రత్యేకంగా రూపొందించిన వందకు పైగా వాహనాలున్నా నిర్వాహకులు మున్సిపల్ వ్యర్థాలను తరలించే వాహనాల్లోనే వాటిని పడేస్తున్నారు. చెత్త సేకరణ చేసేవాళ్లు వాటిని తీసుకొచ్చి గృహ వ్యర్థాలతో కలిపి డంపింగ్ యార్డుల్లో పారబోస్తున్నారు. అయితే డంపింగ్ యార్డు నిర్వాహకులు సైతం వాటిని వేరు చేయకపోవడంతో గృహ వ్యర్థాలతోనే అవి కలిసిపోతున్నాయి. నార్సింగి, మణికొండ, నానక్‌రామ్‌గూడ డంపింగ్ యార్డుల్లో బయో మెడికల్ వ్యర్థాల కుప్పలుగా దర్శనమిస్తున్నాయి. వాటిలో సూదులు, సిరంజిలు, గాయాలకు డ్రెస్సింగ్ చేసిన దూది, సెలైన్ బాటిళ్లు, మూత్రపు పైపులు, మాస్కులు, చేతి గ్లౌజులు ఉన్నాయి. సిబ్బంది చేతులతోనే తీస్తున్నారు. ఇంత జరుగుతున్నా కాలుష్య నియంత్రణ మండలి ఎలాంటి తనిఖీలు లేకపోవడంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

పర్యావరణానికి ముప్పు...

బయో మెడికల్ వ్యర్థాల నిర్వహణ శాస్త్రీయంగా చేపట్టాల్సి ఉంటుంది. వాటిని బహిరంగ ప్రదేశాల్లో, గృహ వ్యర్థాలతో కలిపి పారబోయడం అత్యంత ప్రమాదకరం. దవాఖానల్లో వైద్య చికిత్సలు, వ్యాధి నిర్ధారణ పరీక్షలు చేయడం ద్వారా బయో వ్యర్థాలు భారీగా పోగుపడుతాయి. వీటిలో సూదులు, సిరంజీలు, దూది, మాస్కులు, చేతి గ్లౌజులు, రక్త పరీక్ష పరికరాలు, సెలైన్ బాటిళ్లు, వైర్లు, పీపీఈ కిట్లు, శానిటరీ నాప్‌కిన్‌లు ఉంటాయి. వీటిని జీవ వైద్య వ్యర్థాల నిర్వహణ నిబంధనలు-2016 ప్రకారం సురక్షితంగా, శాస్త్రీయంగా నిర్వహించాల్సి ఉంటుంది. కానీ దవాఖాన యాజమాన్యాలు నిర్లక్ష్యంతో ఇష్టానుసారంగా బహిరంగ ప్రదేశాల్లో పడేస్తున్నాయి. ఇలా బయో మెడికల్ వ్యర్థాల్లో ఉండిపోయిన కొన్ని రకాల బ్యాక్టీరియా, వైరస్, రోగ కారకాలు.. వ్యర్థాలను తొలగించే సిబ్బందికి సంక్రమించే ప్రమాదం ఉంటుంది. అలాగే వీటిని తొలగించే క్రమంలో సూదులు, ఫోర్‌స్లిప్‌లు గుచ్చుకుని పారిశుధ్య కార్మికులు ఇన్‌ఫెక్షన్ల బారిన పడుతున్నారు. అదేవిధంగా వాటిలోని రసాయనాలు, బ్యాక్టీరియా, వైరస్‌ల వల్ల గాలి, నీరు, నేల కలుషితమవుతున్నాయి. వాటిని తొలగించే క్రమంలో సిబ్బందికి హెపటైటిస్, హెచ్‌ఐవీ, టీబీ వంటి వ్యాధులు సంక్రమించే ప్రమాదాలు కూడా ఉన్నాయి.

తనిఖీలు చేపట్టాలి..

బయో వ్యర్థాలను దవాఖానల నుంచి సేకరించే వాహనాలు గ్రేటర్ వ్యాప్తంగా వందకు పైగా ఉన్నాయి. వీటిలో వివిధ రకాల వ్యర్థాలను స్టెరిలైజ్ చేసేందుకు ఏర్పాట్లు ఉంటాయి. ఆయా వాహనాలు జీపీఎస్ ట్రాకర్‌తో అనుసంధానమై ఉంటాయి. వీటిని నిర్వహించే ఏజెన్సీ వాళ్లు కాలుష్య నియంత్రణ మండలిలో వాహనాల రిజిస్ట్రేషన్లు చేసుకుంటారు. ఇవి నిరంతరం అన్ని దవాఖానల్లో చెత్తను సేకరిస్తుంటాయి. ఇందుకు దవాఖానలు నిర్వహణ ఖర్చు ఇవ్వాల్సి ఉంటుంది. ఆ డబ్బు ఇవ్వకుండా తప్పించుకునేందుకు దవాఖానలు బయో వ్యర్థాలను మున్సిపల్ చెత్త సేకరణ వాహనాల్లో వేస్తున్నారు. దీంతో అవన్నీ డంపింగ్ యార్డులకు చేరి పర్యావరణంతో పాటు చెత్త సేకరణ సిబ్బందికి హాని కలిగిస్తున్నాయి. ఇలాంటి బయో మెడికల్ వ్యర్థాల నిర్వహణపై కాలుష్య నియంత్రణ మండలి నిరంతరం పర్యవేక్షించాల్సి ఉంటుంది. దవాఖానలు, గృహ వ్యర్థాల డంపింగ్ యార్డుల్లో ర్యాండమ్ తనిఖీలు నిర్వహించాల్సి ఉంటుంది. అయితే గ్రేటర్ హైదరాబాద్ పరిధిలో అలాంటి తనిఖీలు ఎంతమాత్రమూ జరగడం లేదని విమర్శలున్నాయి. దీంతో పర్యావరణ కాలుష్యంతో పాటు ఇటు పారిశుధ్య సిబ్బందికి రోగాలబారిన పడుతున్నారు. అధికారులు స్పందించి నిరంతర తనిఖీలు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.

డా.రఘురాం సేవలు అభినందనీయం

రఘురాంకి వచ్చిన గిన్నిస్ రికార్డులను ప్రదర్శిస్తున్న గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ

సిటీబ్యూరో, జూన్22 (నమస్తే తెలంగాణ): మూడు నెలల క్రితం మౌంట్ అబూలోని బ్రహ్మ కుమారీస్ ప్రపంచ ప్రధాన కేంద్రంలో అత్యధిక సంఖ్యలో రొమ్ము క్యాన్సర్ అవగాహన తరగతులు నిర్వహించి డా.రఘురాం రెండు గిన్నిస్ వరల్డ్ రికార్డులు సాధించారని తెలంగాణ గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ కొనియాడారు. ఆదివారం హైదరాబాద్‌లోని బ్రహ్మ కుమారీస్ శాంతి సరోవర్ ప్రధాన కార్యాలయంలో నిర్వహించిన 'రొమ్ము క్యాన్సర్ ఏబీసీఎస్- ప్రతి మహిళ తెలుసుకోవలసిన విషయాలు' అనే కార్యక్రమాన్ని ప్రారంభించిన గవర్నర్ మాట్లాడుతూ.. ఐదేళ్లుగా అక్టోబర్ నెలలో తెలంగాణ రాజ్‌భవన్‌ను గులాబీ రంగులో వెలుగులు వెలిగించి క్యాన్సర్‌పై అవగాహన కల్పిస్తున్న డా.రఘురాం సేవలు అభినందనీయం అని పేర్కొన్నారు. కిమ్స్-ఉషాలక్ష్మి బ్రెస్ట్ డిసీజ్ సెంటర్ వ్యవస్థాపక డైరెక్టర్, ఉషాలక్ష్మి బ్రెస్ట్ క్యాన్సర్ ఫౌండేషన్ చైర్మన్ డా. రఘురాం మాట్లాడుతూ రొమ్ము క్యాన్సర్‌కు సంబంధించి దేశంలో ప్రతి సంవత్సరం 2 లక్షల కొత్త కేసులు, లక్ష మరణాలు నమోదవుతున్నాయని తెలిపారు. క్యాన్సర్‌ను జయించిన బ్రహ్మ కుమారీస్ హైదరాబాద్ కేంద్రాధిపతి బీకే కుల్దీప్ దీదీ తన అనుభవాన్ని పంచుకుంటూ.. నా రొమ్ము క్యాన్సర్ ప్రయాణంలో డా. రఘురాం ఇచ్చిన చికిత్స, శ్రద్ధ, సానుభూతితో నాకు ధైర్యం కలిగిందన్నారు. ఆయన నుంచి అందుకున్న ప్రేరణ వల్లనే నేను ధైర్యంగా ముందుకెళ్లగలిగానని తెలిపారు.

బ్రాహ్మణులు పథకాలను వినియోగించుకోవాలి

మాడుగుల నాగపణి శర్మను సత్కరిస్తున్న బ్రాహ్మణ ఐక్యవేదిక నాయకులు

ముషీరాబాద్, జూన్ 22: కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు అందించే పథకాలపై బ్రాహ్మణులు అవగాహన కలిగి ఉండాలని వాటిని సద్వినియోగం చేసుకోవాలని బ్రాహ్మణ ఐక్యవేదిక సదస్సులో పలువురు వక్తలు సూచించారు. ఆదివారం చిక్కడపల్లి త్యాగరాయ గానసభలో బ్రాహ్మణ ఐక్యవేదిక ఆధ్వర్యంలో ప్రభుత్వ పథకాలు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రముఖ ఆడిటర్ ధవళ మధుసూదన్ రావు మాట్లాడుతూ బ్రాహ్మణులు కేవలం వృత్తిపైనే ఆధారపడకుండా వ్యాపార రంగంలో రాణించాలని సూచించారు. ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకొని ఆర్థికంగా బలపడాలని అన్నారు. ఈ సందర్భంగా పద్మశ్రీ అవార్డు అందుకున్న డాక్టర్ మాడుగుల నాగ ఫణి శర్మను ప్రత్యేకంగా సన్మానించారు. అనంతరం మాడుగుల మాట్లాడుతూ బ్రాహ్మణులు ఐకమత్యంతో ముందుకు వెళ్లినప్పుడే సమాజం హితం ఉంటుందన్నారు. బ్రాహ్మణ ఐక్యవేదిక అధ్యక్షుడు డాక్టర్ ఏవీఆర్ మూర్తి అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో బ్రాహ్మణ ఆర్గనైజేషన్ ఫర్ సోషల్ సర్వీస్ నాయకులు బసవరాజు శ్రీనివాస్, అన్నదానం సత్యనారాయణమూర్తి, సుధాకర్, మురుకుంట్ల రాజేశ్వరి శర్మ, డాక్టర్ వైజయంతి, పురాణపండ సురభి శర్మ, బ్రాహ్మణ ఐక్యవేదిక కార్యవర్గ సభ్యులు పొప్పూరి శ్రీనివాస్, ఏక శిరీష, శైలజ, సునీత మూర్తి, శ్రీరంగం కృష్ణమాచార్యులు, గుడిపాటి మారుతి రామచంద్ర, సురేశ్ మోహనా చారి, సరళ, పద్మలత, సూర్య ప్రకాశ్ పాల్గొన్నారు.

బీసీలకు 42 శాతం రిజర్వేషన్ కల్పించాలి

బీసీ రాజ్యాధికార సమితి అధ్యక్షుడు సురేశ్

మాట్లాడుతున్న బీసీ రాజ్యాధికార సమితి వ్యవస్థాపక అధ్యక్షుడు దాసు సురేశ్

మేడ్చల్, జూన్ 21 : కాంగ్రెస్ పార్టీ ఎన్నికల సమయంలో ఇచ్చిన కామారెడ్డి డిక్లరేషన్ ప్రకారం బీసీలకు స్థానిక సంస్థల్లో 42 శాతం రిజర్వేషన్ కల్పించాల్సిందేనని బీసీ రాజ్యాధికార సమితి వ్యవస్థాపక అధ్యక్షుడు దాసు సురేశ్ డిమాండ్ చేశారు. బీసీల హక్కులకు జీవో జారీ చేయకపోతే, వాటి ప్రకారమే స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించకపోతే రాష్ట్రంలో బీసీ ఉద్యమం మరింత తీవ్రతరమవుతుంది అని హెచ్చరించారు. బీసీ ముఖ్య నాయకుల రౌండ్ టేబుల్ సమావేశం ఆదివారం మేడ్చల్ లో జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూనిధులు, ఇతర విషయాలపై ఢిల్లీ వెళ్లి ప్రధానిని కలుస్తున్న సీఎం రేవంత్ రెడ్డి బీసీ రిజర్వేషన్‌లు అమలు విషయంలో మాత్రం మాట్లాడటం లేదన్నారు. అఖిల పక్షంతో సభ్యులతో ఢిల్లీ వెళ్దాం, కేంద్ర ప్రభుత్వాన్ని కలుద్దామని చెప్పిన ఆయన ఊసే తీయడం లేదన్నారు. 42 శాతం రిజర్వేషన్ హామీని అమలు చేయకపోతే కాంగ్రెస్ ప్రభుత్వానికి బీసీల నుంచి తీవ్ర ప్రతిఘటన తప్పదని హెచ్చరించారు. రాహుల్ గాంధీ దేశ వ్యాప్తంగా నిర్వచించే సామాజిక న్యాయం ఇదేనా అని ప్రశ్నించారు. బీసీల నాయకత్వ నిర్మాణాన్ని క్షేత్రస్థాయిలో చేపడుతూ ఇప్పటికే 25 జిల్లాలలో కమిటీలను పూర్తి చేశామన్నారు. బీసీలను బలమైన సంఘటిత శక్తిగా మార్చడానికి కోటి సభ్యత్వాల నమోదు కార్యక్రమాన్ని చేపట్టామన్నారు. అంతకు ముందు బీసీ రాజ్యాధికార సమితి ఆధ్వర్యంలో కొనసాగుతున్న కోటి మంది బీసీ కార్యకర్తల సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని జిల్లా బీసీ నాయకులతో ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో బీసీ రాజ్యాధికార సమితి రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీ గండి వీరేందర్ గౌడ్ , కార్యవర్గ సభ్యులు రాములు ,రాష్ట్ర విద్యార్థి నాయకులు శ్రీశైలం కురుమ పాల్గొన్నారు.

రాష్ట్ర పరువు తీస్తున్న సీఎం రేవంత్‌రెడ్డి

- ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి
- బీఆర్‌ఎస్‌లో చేరిన కాంగ్రెస్ నేతలు

మాట్లాడుతున్న మాజీ మంత్రి, ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి

బడంగ్ పేట్, జూన్ 22: సీఎం రేవంత్‌రెడ్డి తెలంగాణ రాష్ట్ర పరువు తీస్తున్నారని మాజీ మంత్రి, ఎమ్మెల్యే సబిత ఇంద్రారెడ్డి ఎద్దేవా చేశారు. మహేశ్వరం మండలం మన్సాన్‌పల్లి గ్రామానికి చెందిన మర్యాద రాఘవేందర్‌రెడ్డితో పాటు వందలాదిమంది కార్యకర్తలు ఎమ్మెల్యే సబిత ఇంద్రారెడ్డి సమక్షంలో బీఆర్‌ఎస్‌లో చేరారు. ఆమె గులాబీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. అనంతరం ఆలయంలో ప్రత్యేక పూజలు చేసి సభా స్థలికి తరలివచ్చారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రేవంత్ రెడ్డి అధికారం కోసం అమలు కాని వాగ్దానాలు ఇచ్చి రాష్ట్ర ఆత్మగౌరవాన్ని బజారుకు ఈడుస్తున్నారని అన్నారు. నాలుగు వేలు ఇస్తా అన్న పింఛన్లు ఇవ్వకుండా, మహిళలకు రూ. 2500 ఇస్తామని చెప్పి ఇవ్వకుండా ప్రజలను అయోమయంలో పడవేస్తున్నారని మండిపడ్డారు. ఇందిరమ్మ ఇండ్లు అర్హులకు కాకుండా కాంగ్రెస్ కార్యకర్తలకు ఇస్తే చూస్తూ ఊరుకునేది లేదన్నారు. రాజీవ్ యువకిరణాలకు సంబంధించిన లోన్స్ ఎందుకు ఇవ్వడం లేదని ప్రశ్నించారు. ఒక్కరికీ కూడా ఇప్పటివరకు రేషన్ కార్డు రాలేదని అన్నారు. కొత్త పింఛన్లు ఎంత మందికి మంజూరు చేశారో చెప్పాలన్నారు. సర్పంచ్ ఎన్నికలు వస్తున్నాయని రైతుబంధు వేస్తామని చెప్పడం సిగ్గుచేటన్నారు.

కాంగ్రెస్‌ను నమ్మేస్థితిలో లేరు..

రంగారెడ్డి జిల్లాలో రియల్ ఎస్టేట్ బాగా ఉందని వ్యవసాయ భూములు లేవని సీఎం రేవంత్ రెడ్డి రైతుభరోసా రద్దు చేశారని మండిపడ్డారు. గతంలో రూ.159 కోట్లు ఒక మహేశ్వరం మండలానికే వేశారని ఆమె గుర్తు చేశారు. 19 మండలాల్లో రైతుభరోసా రద్దు చేయడం ఎంతవరకు సమంజసమన్నారు కాంగ్రెస్ పార్టీని ప్రజలు నమ్మే పరిస్థితిలో లేరని అన్నారు. కాంగ్రెస్ పార్టీ అనుసరిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలను విసిగిపోతున్న వారు కాంగ్రెస్ పార్టీని వీడి గులాబీ గూటికి వస్తున్నారని ఆమె తెలిపారు. ఈ కార్యక్రమంలో బీఆర్‌ఎస్ నాయకులు రాజు నాయక్, పాండు యాదవ్, వెంకటేశ్వర రెడ్డి, ప్రభాకర్, తదితరులు పాల్గొన్నారు.

మున్నూరుకాపులపై కాంగ్రెస్ చిన్నచూపు

మున్నూరుకాపు సంఘం రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ దేవయ్య

అభివాదం చేస్తున్న డాక్టర్ దేవయ్య పటేల్ తదితరులు

ఖైరతాబాద్, జూన్ 22: సమగ్ర కులగణనలో మున్నూరుకాపులను ఐదో స్థానంలో పడేశారని మున్నూరుకాపు సంఘం రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ కొండ దేవయ్య పటేల్ ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆ సంఘం అధ్యక్ష, రాష్ట్ర కార్యవర్గ సభ్యుల ఎన్నిక, నియామకపత్రాల పంపిణీ కార్యక్రమం ఆదివారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో జరిగింది. 33 జిల్లాల కార్యవర్గం తెలంగాణ మున్నూరు కాపు సంఘం రాష్ట్ర అధ్యక్షుడిగా డాక్టర్ దేవయ్య పటేల్‌ను మరోసారి ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రాష్టంలో సుమారు 40లక్షలకు పైగా జనాభా కలిగిన మున్నూరుకాపులు ప్రభుత్వాల గెలుపోటములను నిర్ణయించే సత్తా కలిగి ఉన్నారన్నారు. బీఆర్‌ఎస్ ప్రభుత్వ హయాంలో మున్నూరుకాపులకు మంత్రి పదవులు, ఎమ్మెల్సీలు, ఎంపీలు ఇవ్వడంతో పాటు మున్నూరుకాపుల ఆత్మగౌరవ భవనం కోసం రూ.500 కోట్ల విలువైన భూమిని అప్పగించారని గుర్తు చేశారు. రాష్ట్రంలో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం.. కేబినేట్లో మంత్రి పదవి ఇవ్వక పోగా, మున్నూరుకాపుల సంక్షేమానికి బడ్జెట్లో ఒక్క రూపాయి కూడా కేటాయించలేదన్నారు. అనంతరం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్‌గా ఎన్నికైన బాదినేని రాజేందర్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జేవీఆర్, గ్రేటర్ హైదరాబాద్ నగర అధ్యక్షుడు ఆర్వీ మహేందర్ కుమార్‌తో పాటు వివిధ జిల్లాల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులకు నియామక పత్రాలను అందజేశారు.

పోడు సాగుదారులపై దాడులు ఆపాలి

- జీవో 49ను రద్దు చేయాలి
- టీఏజీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ బాబురావు

జీవో 49 పత్రాలను దహనం చేస్తున్న టీఏజీఎస్ నేతలు

చిక్కడపల్లి, జూన్ 22: టైగర్ కంజర్వేషన్ పేరుతో ఆదివాసీలు సాగుచేస్తున్న భూములు, వారు నివసిస్తున్న ప్రాంతాలను కార్పొరేట్ కంపెనీలకు కట్టబెట్టేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు తీసుకువచ్చిన జీవో49ని రద్దు చేయాలని తెలంగాణ ఆదివాసీ గిరిజన సంఘం (టీఏజీఎస్) రాష్ట్ర అధ్యక్షుడు, భద్రాచలం మాజీ ఎంపీ డాక్టర్ మిడియం బాబురావు డిమాండ్ చేశారు. ఆదివారం నగరంలోని సుందరయ్య విజ్ఞాన కేంద్రం ఎదుట సంఘం ఆధ్వర్యంలో జీవో 49 పత్రాలను దహనం చేసి నిరసన ప్రదర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా మీడియం బాబురావు మాట్లాడుతూ.. పోడు సాగుదారులపై ఫారెస్ట్ అధికారుల దాడులు ఆపాలని, పోడు పట్టాలకు బ్యాంక్ రుణాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం బీజేపీ దారిలోనే ఆదివాసీలను అడవుల నుంచి వెళ్లగొట్టే విధానాన్ని అవలంబిస్తోందని విమర్శించారు. పోడు సాగుదారులకు హక్కు పత్రాలు ఇస్తామని కాంగ్రెస్ తన ఎన్నికల మేనిఫెస్టోలో ప్రకటించి ఏడాదిన్నర దాటుతున్నా ఆ హామీని నిలబెట్టుకోకపోగా.. తిరిగి పోడు సాగుదారులపై ఫారెస్ట్ అధికారులతో దాడులు చేయించడం దుర్మార్గమైన చర్య అన్నారు. సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పూసం సచిన్, రాష్ట్ర ఉపాధ్యక్షులు బీరవికుమార్, ఎర్మ పున్నం, శ్రీనివాస్, రాష్ట్ర సహాయ కార్యదర్శి తనుష్, కిష్టన్న, తొడసం శంబు, ఉయిక విష్ణు, వృత్తిదారుల సంఘం రాష్ట్ర కోకన్వీనర్ పైళ్ల ఆశయ్య, నాయకులు.. అశోక్, రాజన్న, దర్శనాల మల్లేశ్, సంకె రవి, కుశన్న రాజన్న, లంకా రాఘవులు, రాజు, కొట్నాక్ సక్కు తదితరులు పాల్గొన్నారు.

సందేహం తీరేదెన్నడు ?

- హెచ్‌ఎండీఏలో విలీన గ్రామాల్లో అమలు కానీ బిల్డ్ నౌ
- ఇప్పటికీ సందిగ్ధంలోనే నిర్మాణదారులు
- బిల్డ్ నౌ అమల్లోకి వచ్చినా... అవగాహన కల్పించని హెచ్‌ఎండీఏ

సిటీబ్యూరో, జూన్ 22 (నమస్తే తెలంగాణ): హెచ్‌ఎండీఏ పరిధిలో కొత్తగా విలీనమైన గ్రామాలన్నీ సందేహాల నడుమ కొట్టుమిట్టాడుతున్నాయి. భవన నిర్మాణ అనుమతుల కోసం ఇన్నాళ్లు డీటీసీపీని ఆశ్రయించిన బిల్డర్లు, సాధారణ జనాలు.. ఇప్పుడు హెచ్‌ఎండీఏ బాట పట్టాల్సి వస్తున్నది. కొత్తగా 300కు పైగా గ్రామాలను విలీనం చేసి, 11 జిల్లాలకు హెచ్‌ఎండీఏ పరిధిని విస్తరిస్తూ మూడు నెలల కిందటే ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. కానీ భవన నిర్మాణ అనుమతుల విషయంలో తీసుకోవాల్సిన చర్యలపై ఇప్పటికీ స్థానికంగా చేపట్టలేదు. దీంతోపాటు టీజీబీపాస్‌ను తొలగించిన పురపాలక శాఖ, దానికి బదులుగా బిల్డ్ నౌ తీసుకొచ్చింది. కానీ అనుమతుల విషయంలో డీటీసీపీని ఆశ్రమించిన వారు, పలు దశల్లో పెండింగ్‌లో ఉన్న ఫైళ్ల విషయంలో మాత్రం ఇబ్బందులు తలెత్తుతున్నాయి. కొత్త దరఖాస్తులను బిల్డ్ నౌ ఆధారంగానే పరిశీలించి అనుమతులు జారీ చేస్తున్నా... పాత దరఖాస్తుల వ్యవహారం సందిగ్ధానికి కారణమవుతున్నది.

పెండింగ్ దరఖాస్తులను..

ఏడు జిల్లాలకు పరిమితమైన హెచ్‌ఎండీఏలో 300కు పైగా గ్రామాలను విలీనం చేసిన ప్రభుత్వం 11 జిల్లాల పరిధిలో 10500 చదరపు కిలోమీటర్ల విస్తీర్ణంతో కొత్త పరిధిని నిర్మిస్తూ జీవో నం. 68ను మార్చి రెండో వారంలో జారీ చేసింది. విలీనమైన గ్రామాల్లో భవన నిర్మాణ అనుమతులన్నీ ఇకపై డీటీసీపీ నుంచి మారిపోవాలి. కానీ గతంలోనే డీటీసీపీలో చేసిన దరఖాస్తులు, చెల్లించిన ఫీజుల వ్యవహారాన్ని సర్దుబాటు చేయాల్సిన ప్రభుత్వం ఆ విషయాన్ని మరిచింది.

నిర్ణీత గడువు లేకనే...

డీటీసీపీ గ్రామాలను హెచ్‌ఎండీఏ పరిధిలోకి తీసుకువస్తూ నిర్ణయం తీసుకున్నా... అందుకు తగినట్లుగా ఏర్పాట్లు చేయడంలో ప్రభుత్వం, హెచ్‌ఎండీఏ విఫలమైంది. కనీసం విలీన గ్రామాల్లో పరిధిలో జీవోకి ముందుకు చేసిన దరఖాస్తులను కూడా హెచ్‌ఎండీఏ వస్తాయని ప్రకటించకపోవడమే ఇప్పుడు సమస్యకు కారణమైంది. అదేవిధంగా పాత దరఖాస్తులను డీటీసీపీలోనే కొనసాగించి, నిర్ణీత గడువు నుంచి హెచ్‌ఎండీఏ నిబంధనలు అమల్లోకి వస్తాయని చెప్పినా.. ఈ సందేహాలకు అవకాశం ఉండేది కాదు. కానీ ప్రభుత్వం అలాంటి ప్రకటన చేయకుండా, గ్రామాలను విలీనం చేస్తూ, శాఖాపరమైన చర్యలు తీసుకోవడంలో విఫలమైంది. దీంతో దరఖాస్తుదారులు, నిర్మాణ సంస్థలు కూడా ఆందోళన చెందుతున్నాయి. దీంతోనే దరఖాస్తుదారులు అటు హెచ్‌ఎండీఏ, ఇటు డీటీసీపీ అధికారులను సమన్వయం చేసుకోవడం ఇబ్బందిగా మారిందని వాపోతున్నారు.

నేడు జాబ్ మేళా

సిటీ బ్యూరో, జూన్ 22 (నమస్తే తెలంగాణ): వృత్తి విద్యా కోర్సులు పూర్తి చేసుకున్న విద్యార్థులకు వెస్ట్ మారేడుపల్లి కస్తూర్బా గాంధీ బాలికల జూనియర్ కళాశాలలో సోమవారం జాబ్‌మేళా నిర్వహించనున్నట్లు జిల్లా ఇంటర్ విద్యాధికారి ఒడ్డన్న తెలిపారు. పారామెడికల్, నాన్ పారామెడికల్‌కు సంబంధించిన 164 కంపెనీలు పాల్గొంటున్నాయన్నారు. 3,153 ఉద్యోగ ఖాళీలున్నాయని, వృత్తి విద్యా కోర్సులు చదివిన వారు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. యువతకు ఉపాధి ఉద్యోగాల కల్పనే లక్ష్యంగా జాబ్ మేళా నిర్వహిస్తున్నామని ఆయన తెలిపారు.

చెయ్యి తడిపితేనే.. పని

- ఏసీబీ దాడులు..విజిలెన్స్‌కు ఫిర్యాదులు వెళ్లినా.. మారని తీరు
- పర్యవేక్షణ లోపంతో అవినీతిమయం
- 'మేడ్చల్' మున్సిపాలిటీల్లో ఇదే పరిస్థితి

మేడ్చల్, జూన్ 22(నమస్తే తెలంగాణ): మున్సిపాలిటీలు అవినీతి మయంగా మారుతున్నాయి. ఏసీబీ దాడులు, విజిలెన్స్‌కు ఫిర్యాదులు వెళ్తున్నా.. అవినీతి తగ్గడం లేదు. మేడ్చల్ జిల్లాలోని అన్ని మున్సిపాలిటీల్లో ఇదే పరిస్థితి ఏర్పడింది. దీనికి తోడు ప్రత్యేక అధికారుల పర్యవేక్షణ లోపంతో మున్సిపాలిటీల అధికారులు, సిబ్బంది ఇష్టారాజ్యంగా మారింది. టౌన్‌ప్లానింగ్ నుంచి ట్యాక్స్ వరకు ప్రతి సేవకు రేట్లు ఫిక్స్ చేసి ప్రజల వద్ద వసూళ్లు చేస్తున్నారు. అభివృద్ధి పనుల కంటే మామూళ్లపై దృష్టి సారించి ప్రజల వద్ద అధికారులు దండుకుంటున్నారు. మేడ్చల్ జిల్లాలో నాలుగు కార్పొరేషన్లు, 12 మున్సిపాలిటీలు ఉన్నాయి. శివారు ప్రాంతంలో ఉన్న మున్సిపాలిటీలకు హైదరాబాద్ నగరానికి సమీపంలో ఉన్న నేపథ్యంలో తెలంగాణ ప్రాంత వాసులే కాకుండా ఇతర రాష్ట్రాల నుంచి వచ్చి శివారు మున్సిపాలిటీల ప్రాంతాల పరిధిలో నివాసం ఏర్పర్చుకుంటున్నారు. దీంతో మేడ్చల్ జిల్లాలోని శివారు ప్రాంతాల మున్సిపాలిటీల్లో డిమాండ్ ఏర్పడింది. మున్సిపల్ అధికారులు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారు.

అయినా తీరు మార్చుకోలే..

ఇటీవల కాలంలోనే నాగారం మున్సిపాలిటీలో విధులు నిర్వహించే డీఈ రఘు కాంట్రాక్టర్ వద్ద రూ. 75 వేలు లంచం తీసుకుంటూ.. ఏసీబీ అధికారులకు రెడ్ హ్యాండెడ్‌గా పట్టుబడ్డాడు. తూంకుంట మున్సిపాలిటీలో ఇంటి మ్యుటేషన్‌కు సంబంధించి లంచం డిమాండ్ చేయగా, బిల్ కలెక్టర్‌గా విధులు నిర్వహించే రాంరెడ్డి, కంప్యూటర్ ఆపరేటర్‌గా విధుల నిర్వహించే శ్రావణ్‌ను ఏసీబీ అధికారులు పట్టుకున్నారు. ఘట్‌కేసర్ మున్సిపాలిటీలో ఇన్‌చార్జి ఏఈగా విధులు నిర్వహిస్తూ రాజశేఖర్, వర్క్ ఇన్‌స్పెక్టర్ సన్నీలు కంట్రాక్టర్ వద్ద రూ. 30 వేలు లంచం తీసుకుంటూ.. ఏసీబీకి చిక్కారు. అంతేకాకుండా బోడుప్పల్, పీర్జాదిగూడ, జవహర్‌నగర్, గూండ్లపోచంపల్లి, మేడ్చల్, నాగారం తదితర మున్సిపాలిటీల్లో తాగునీటి సరఫరా, మోటర్ల మరమ్మతులు, సామగ్రి కొనుగోలు పేరిట అవినీతి జరిగిందని విజిలెన్స్ అధికారులకు ఫిర్యాదులు వెళ్లడంతో బాధ్యులపై విచారణ చేస్తున్నామని చెబుతున్నా.. ఇప్పటి వరకు ఎలాంటి చర్యలు తీసుకోలేదన్న ఆరోపణలు ఉన్నాయి.

అడిగినంత ఇస్తేనే..

మున్సిపాలిటీల్లో అత్యధికంగా టౌన్‌ప్లానింగ్ విభాగంలోనే అవినీతి జరుగుతుందన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఇంటి నిర్మాణాలకు దరఖాస్తులు చేసుకొని అన్ని రకాల ధ్రువీకరణ పత్రాలు సమర్పించినా.. ఇంటి అనుమతుల జారీలో ఇబ్బందులకు గురి చేస్తున్నారు. వారు అడిగింది ఇస్తే ఎలాంటి ఇబ్బందులు లేకుండా ఇంటి అనుమతులు జారీ చేస్తున్నారు. అక్రమ నిర్మాణాలు చేపట్టిన వారిపై చర్యలు తీసుకోవాల్సింది పోయి.. ముడుపులు ఇస్తే అక్రమ నిర్మాణాలపై ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదు. దీంతో పాటు ఇంటి పన్ను మార్పులు, ఖాళీ స్థలాల పన్ను విధింపుల్లో అధికారులు ముడుపులు అడుగుతున్నారు. ఈ పనికి ఇంత అని ఒక ధరను ఫిక్స్ చేసి.. బ్రోకర్లను అధికారులు ఏర్పాటు చేసుకున్నట్లు స్థానికులు ఆరోపిస్తున్నారు.